# ౨ "గోరీ" మీాది చింబోతు

మనం సర్వసాధారణంగా కథల్లోనూ పురాణాల్లోను చదువుతూ వుండడం, ఆచదివే చదువునుబట్టి నమ్ముతూవుండడంకద్దు! అవన్నీ, దేవతావిషయాలు. పైలోకానికి సంబంధించినవి. శివకేశవులు ప్రత్యక్ష మౌతారు. అశరీరవాణి పలుకుతుంది. మృత్యుముఖమే గంధర్వనగరమై వినోదం కల్పిస్తుంది.

కాని 'కరీమ్‌బక్ష్' అనే వొకానొక కసాయివాడు, తురుష్కుడు 'అమేషా' మేకల్నీ గొడ్లనీచంపి, ఆమాంసం అమ్మి అందువల్ల ధనమార్జించిన లుబ్ధుడు, అతగాడు చనిపోయినప్పుడు మహావిలయద్వారం అయఃకవాటాల్ని తెరచి తనలోనికి లాక్కుని, లాకు తలుపల్లా మూసుకూరుకుంది. వట్టిభౌతికపుచావు చచ్చాడు. నాగలోక వాసులుగాని నాకలోక వాసులుగాని ఆజీవినిగురించి తలపెట్టి యుండలేదు.

'కరీమ్‌బక్ష్' యొక్క అస్థిరకాయం నేలపూడ్చి అందు మీద తమ మతప్రకారం "గోరీ" వెలయించారు కొందరు మహమ్మదీయులు. 'గోరీ' పచ్చి యింకా ఆరిపోకుండానే అందరూ ఆ కాలంచేసిన కసాయివాణ్ణి విస్మరించేశారు.

జీవనమున్న మేఘం అలుముకుపోవాలీ అంటే' గాలికావాలికాని జీవనంలేని చీకటికి నివాతవాతావరణమే చాలు! 'కరీమ్‌బక్ష్' చనిపోయిన వెనుక ఓనిశ్చలమైన రాత్రివేళ రెండోజాంటికి తెలీకుండా సాంద్రతమంగా తమోరాశి విడివడ్డదై నాలుగు దెసల్నీ నల్లబఱచి, చింతచెట్టుమీది దయ్యాల్నీ మఱ్ఱిమానుమీది పిశాచాల్నీ కూడా, మూగవోయి రిచ్చపాటుతో తన్నుచూడమన్నట్టు నిలవుండి పోయింది. ఆకాశంమీదినుంచి తెలిమంచు పూలరేకులపైని జారిపడుతూన్న పాళపు సడినన్నకూడా ఆనిశీథినీలక్ష్మి నోచుకోలేదు.

ఏతన్నిబిడాంధకారంతో పాటు ఏకాంతంగా, ఏకాకిగా ఏమాత్రం అలికిడీకానీకుండా ఎందుకో అన్నట్టు ఇలువెడలి నడుస్తూవుంది, నల్లని బురకావేసికొని బురకాలోంచి నల్లని చీకటి చూస్తూ 'కరీమ్‌బక్ష్' వితంతువు రభియాబీబీ. భర్త చనిపోయినా ఆమె మనస్సు భర్తమీదనే వున్నది. 'మఱచిపోతల్లీ! మఱి బ్రతికిరాడు నీమగడు' అని "వరసా" వెనుక ఎంతగా తనవాళ్లు తనకు బోధించి నప్పటికిన్నీ మఱచిపోలేకపోయింది.

"గోరీ"లో పాతిపెట్టబడ్డాక కాలిగోరైనా పైకి కనబడదు. అంత లోతుగా నంతహెచ్చుతగ్గు రాకుండా తవ్వి పాతిపెట్టి అందుమీద ఇటుక్కట్టు కట్టి సున్నంవేసి, చెప్పన్నగోరీలకూ వేసినట్టే వెల్లవేపేసినారు నీమగని గోరీకిన్నీ, ఇది 'కరీమ్‌బక్ష్‌గోరీ' అనికూడా ఆనవాలు పట్టలేవుసుమా! అని లోలోపలి తనహృదయం వెనక్కులాగేస్తూవున్నా కాదని! కదలి పోయింది.

హృదయం! దాన్ని ఎముకలగూడులో జొనిపి, అందుమీద కండ పట్టించి, కండమీద త్వక్కుతొడిగి, ఎంతో ఇరికించివుంచేం! అటువంటి

"అల్కా" హృదయం చెప్పేమాటా? ఆమె వినేది? నాటిరేయి?—
నాటిరేయి నామె నేదో విశాలహృదయం, వాళ్ళూకళ్ళూ మించి మిలమిల కలకలమంటూవున్న అనశ్వరవిరాట్ మహోరస్క సంస్కారకౌస్తుభకాంతితో కూడుకున్నదేదో యేదో పిల్చి తీసికొనిపోతూవుంది. ఆమె కారేయి వెనుచూపులేదు. ప్రక్కచూపులేదు. నేలచూపులేదు. ఆమె దృక్కు! మగని 'గోరీ' యెత్తున ఆగి మగని గోరీ పొడుగు తాచాచుకొని పోయింది, పూచుకొనిపోయింది ఆమె నడచిన నడకనే. ఆమె తనమగని గోరీ దాసినకొద్దీ దాసినకొద్దీ ఆమెకూరకే మగనిరూపం సాక్షాత్కరింప దొడగింది.

* * *

"కరీమ్‌బక్ష్" రూపం. కఠోరరూపం, కొడిగట్టిన దీపకళ వాని బ్రతికివున్నప్పటి జీవకళ. అటువంటప్పుడు చనిపోయిన తరువాత వాని కళ ఎలావుంటుందో ఆలోచించండి పాఠకులు!

"మూఛ్ఛ్", "దాడీ", బుగ్గమీసం, కనుబొమల అట్టహాసం, జేనెడు పొడవుకు మొలచివుండి భల్లూకముఖంలా భయంకరంగా వుండడమే కాకుండా, అతని ఇరుచెవుల్నీ చుట్టి విజృంభించుకువుండేవి, రోమాలు, జీమూతంగా చిటకెనవ్రేల నిలువుకుపెరిగి. తల పొన్నకాయలాగు నున్నగా గీయించుకునేవాడు ఎప్పటికప్పక్కాబట్టి కేవలం వెంట్రుకలపోగే కాదు, ఏదో మెదడువున్న మానవుడేను అనికరిపెట్టగలిగేరు ప్రజలు. అదైనా అతగాడు తనజాతికి సంబంధించిన తురకటోపీ పెట్టుకున్నాకా అంటే పోల్చశక్యం కాకపోయేది. మనిషి పొణకింత లావుగా వుండే వాడు. అతడు పెదవులు కదిపితే ఉడుకుడుకు ఉర్దు మాట్లాడేవాడో, లేక బడబడ గ్రుడ్లురిమేవాడో కూడా తెలిసేదికాదు. అతడానందించే

సంగీతం చెవులట్టు కీడ్చుకురాబడే మేకల అరపు. అతనికి తెలిసిన చిత్ర లేఖనం గొడ్లను కోసినప్పటి జంతుసంబంధమైన మాంసపుముద్దలయొక్క విధ్వంసపు బల్లమీది నల్ల సమ్మార్జనం. కసాయికత్తిపుచ్చుకు అతడొక నాడు థక్‌థుక్, థడక్ థుకుక్, ఒకానొక కంచెమేకను తొడకు తొడ, కణుతక్కణత, తోకకు తోక, నాలిక్కనాలెకా, తెగనరుకుతూవుంటే జాబిబొమ్మ నిజంగా సొమ్మసిలి సోలిపోయింది.

*　　　*　　　*

తొల్త "రఖియాబీబీకి" సాక్షాత్కారమైంది "కరీమ్‌బక్ష్"పై ఆకార మేను. చకిత అయింది 'రఖియా'. అసలెప్పుడూ అనుకోలేదు, ఆపె, తన భర్త వోమాటు చనిపోయినతరువాత మళ్ళీ ఆరూపంతో ఎప్పటిమనిషిలా కనిపిస్తాడని. గొణుగువోయింది. "కౌన్ హై ?" అని గద్దించింది. తనకుడిచేయి అలా తెడ్డు తిప్పినట్టు చీకట్లో తిప్పి తన తళతళచూపులు తానే నివారించుకుంది. ఆచేష్టతో ఆమెకళ్ళు చెమ్మగిల్లినయి. చెమ్మగిల్లిన రెండుకళ్ళు రెండుచేతులా వొత్తుకొన్నదై ఆమె మతోఅడుగు ముందుకువేసింది. ఆమెకప్పుడు దారిలో ఎవరున్నా అడ్డమున్నట్టు స్పర్శకుగాని శ్వాసకుగాని తొచలేదు. మటి రెండుఅడుగులు ధూకుడుగా వేసింది, వేవేగమ విభుని గోరీ చేరుకుని దానిముందు సాగిలబడదామని. ఆ పరుగునడకలో మెత్తటి చల్లని "సుర్మా" తనకందోయి నలముకొన్నట్టయింది. "ఇది నా ప్రియుని హృదయమర్మప్రసన్నత ! ఇది నా ప్రియుని హృదయ ధర్మప్రసన్నత !" అని రఖియా పరవశఅయి త్రుళ్ళింత నికంత మనిషైంది. ఖరకాను ఏమరిల్లింది.

*　　　*　　　*

సహజంగా 'రఖియా' ఎత్తరి, బిత్తరి, తలోదరి! పైత్రుళ్ళింత నికంత మనిషైందీ అంటే చీకటికెదోదరి దొరికింది అన్నమాట! ఆమె వల్లని కురులు, ఇరులకరళ్ళు తగిలి, ఇరుగుపొరుగుల కూగిపోయినాయి. అంధస్సు ఛాయమాత్రపుది కనుక, వేణీబంధం అతి మెత్తనిది కనుక, జాగ్రదవస్థ యెంతటిదైనా సవ్వడి కాలేదు. పైపెచ్చు అతిరహస్య ప్రశాంతిమనిపించింది, జగత్తుకా విలోలత!

"రఖియా" మరొక్క అడుగులో "కరీంబక్ష్" సమాధికడ మోక రిల్లి ముందుకొఱిగి తన తలకట్టు చివళ్ళతో ఆకట్టడాన్నంతా అప్పొదించి వూరుకుంది. క్రమంగా ఓపార్శ్వానకు తన శరీరం ఆన్చుకొన్నదై తన చేదోయి నలా సమాధిమీదకు పడవైచి సమాధియొక్క పంపునే అర చేతులతో వెన్నరాచినట్టు రాస్తూవుంది. ఆ రాయడంలో ఆమె ఏమేమో సుఖానుభవం దుఃఖానుభవం కూడా తన్ను దామఱచి అనుభవింపసాగింది ఆమెతోపాటు మనంకూడా కొంతసేవు మఱచిపోదామా మనల్ని మనం? పాఠకులారా!

* * *

స్త్రీజాతికి సంబంధించిన శబ్దజాలంలో రెండే మగవాని మనుగడకు ఊతపదాలు. అందొకటి "మాత". రెండు "మనోహరి". నీవు పుట్టకముందు, ప్రపంచంలో తల్లక్రిందులుగా యోచిస్తూ నీ రూపురేఖలు వెనక్కు తరతరాలుగా నెట్టుకుపోయి తుదకు తనకడుపు పంటగా కని మురిసిపోయినది "మాత". నీవు మృతినొందినప్పటికిన్నీ నీయొక్క ఆత్మను అమృతప్రాయంగా తలపోసికొన్నదై, కారాకురాలికల నడుమ పడే ఎద్దడివానల సన్నచినుకులయొక్క చిందురవళిలో నీ పిలుపూ, ఇసుక తెన్నులమీది గాలికూనలయొక్క తప్పటడుగలనే నీరాకా, అరఘు

చున్నదై సమాధిషంటగా తెలిసి ముక్తిని చూరగొనేది "నీ మనోహరి". జననగర్భము ఒకవంక మరణగర్భము ఒకవంక రెండూ అతిచిత్రములు. ఆ రెండింటి లోపలను ఇమిడి జీవి ఎట్టెట్టి విచిత్రపుటూహలు గొనువాడో, ఎట్టెట్టి వింత ఆకారాలు దాల్చువాడో ఎవ్వరికిన్నీ డెలియరాదు. ఏరూపు రేఖ లెలాగు లోలోపల దాల్చినా, ఒక్కనామంతోనే ఆజీవిని మతప్రబోధకులు పిలుస్తూవున్నారు "ఆత్మ" అని. శరీరధారికి ఆత్మ శరీరంలోనే వుంటుంది. సీసాలో పొగపోసి బిరడావేసినట్టే. కాని అశరీరాలకు ఆకాశంలో మేఘంలా మారుతూవుంటుంది. ఎత్తయినకొండమీద నిలబడితే మేఘం మనతలకుతగిలినట్లే, వొక్కొక్కప్పుడు దాటిపోయిన ఆత్మ మనకు సంఘటనం కావచ్చు.

ఈ వేదాంతమేమిన్నీ "రఖియాబీబి"కి తెలియదు. గోరీ యొక్క గోడినే, తనమగని "దాడీ" గోళ్ళతో మున్ను చిక్కవాపినట్లు, గీయసాగింది. ఆ ప్రేమ అనూనముగదా! తెల్లని తన మగని సమాధి మీద నల్లని వన్నె చూచింది. నల్లని వన్నె వున్నంత మేరా మేనుమెత్తపట్టుగా గ్రహించింది. "ఇది సమాధికాదు" "బడెఆద్మీ" "ఆద్మీకాదు ఆత్మ" "ఆత్మకాదు అల్లా!" అని బహూ ప్రశంసించింది. ఆమెయొక్క ప్రశంస "సత్యం! సత్యం!" అన్నమాదిరిగా కడనే ఎత్తు పెరిగి రుద్రభూమికంతకూ నీడయిస్తూ, అమరియున్న గానుగుచెట్టు పూలురాల్చింది.

"రఖియా" యింకా సమాధిని గట్టిగా కవుగలించుకుంది. తరించే ననుకుంది. ఆమెయొక్క ఆ బిగికౌగిటిలో ఏముందో ఆమెకే తెలిసింది కాదు. చింబోతు వొకటి చలించిలేచి "మె. ఎ." అంటె, హ్రస్వ స్వరమయ ప్రతిధ్వనిగా అతిగంభీరంగా. "రఖియా" వెంటనే తెలివినొంది

"చెదరివచ్చిన బక్రీ" వా ? పాపీ !" అని ఆచింబోతును విడిచిపుచ్చింది ఆమె ఆ మేకపోతును వెళలనడిపించి. గొల్లబోయడు తన సన్న జీవనాన్ని పట్టుకొని 'ఎలాచెదరి పోయినావు ? రేత్రిరల్లా ఎక్కడున్నావు?' అని నిజమైన ప్రేముడితోదాని గడ్డం దువ్వుతూ మందలోకి తోలుకు పోతూవుంటే, అనోరులేని జంతువును కంటూ ఆవితంతువు శాశ్వత నైరాశ్యానికి బలిఅయింది.

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 8-10-1938 | రాజమండ్రి | 'వినోదిని'లో |